# పేరు తెచ్చిన బాధ X

రచన:
"కళాశ్రీ"

పండగ వెళ్ళిన పదిరోజులికి పుట్టింటి దగ్గర నుంచి వెంకటలక్ష్మి అత్తవారింటికి వచ్చింది. ఇప్పుడామెకు అత్త వారిల్లంటే కొత్తగా వుంది. ఆమెకు విపరీతమైన జబ్బు చేయడంవల్ల సంవత్సరం నుంచి పుట్టింటి వద్దే గడిపింది. చిల్లరి మొల్లరి సామానులతో తన భార్యామణి గుమ్మంలో అడుగు పెట్టేసరికి ప్రకాశానికి ఎక్కడ లేని ఆనందం వచ్చిపడింది.

వెంకటలక్ష్మి జబ్బుపడి బాగా కోలుకొంది. అసలు తనభార్య మళ్ళీ తన యింట్లోకి వస్తాదని అనుకోలేదు ప్రకాశం. ప్రకాశం తల్లిపోయికూడా రెండు నెలలయింది. ఈ రెండు నెలల నుంచీ ప్రకాశం పడుతున్న కష్టాలు తన జీవితంలో మరెన్నడూ పడలేదు. తనే స్వయంగా వంట తయారు చేసుకుని పొలంలో పని చేసుకుని, ఆవును గేదను మేపుకొని యింటికి చేరుకునేసరికి చుక్కలు దిగివస్తూన్నాయి. అయినా ఒంటరిగా వుండి ఆసరా లేకపడరాని కష్టాలు పడ్తున్నాడు. కాని నేటికి తన భార్య సుఖంగా తన యింట్కి వచ్చేసరికి ఆమెను ప్రకాశం ఎంతగానో పొగుడుకున్నాడు మనసులో. చెప్పరాని ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

ఆమెను తీసుకు వచ్చిన బంధువులు కూడా మరునాడే వెళ్ళిపోయారు. పందిరిపైకి హాయిగా ప్రాకుతుంది. క్రొత్త సంసారాన్ని నెలకొల్పింది వెంకటలక్ష్మి. వచ్చిన నెలరోజులు భర్తతో చనువుగా హాయిగా వుంటుందేది. ప్రకాశంకు కూడా ఎంతగానో బాగుండేది. కాని వెంకటలక్ష్మికి కాస్త ఆరోగ్యం బాగుండనందున, 'ఆరోగ్యంబాగుండలేద'ని ఆమె తల్లిగారి యింటికి ఒక వుత్తరం వ్రాసి ఎడ్రసు వెంకటరమణ అనే ఆయన చేత వ్రాయించి ప్రక్కింటి కాంతం చేతికిచ్చింది పోస్టులోనే వేయమని.

ప్రకాశంకు ఈ విషయం ఏమీ చెప్పలేదు వెంకటలక్ష్మి, అతని తత్త్వం బాగా తెలుసు గనుక.

వారం రోజులు తర్వాత పుట్టింటి దగ్గర నుంచి వెంకట లక్ష్మికి వుత్తరం వచ్చింది. అది చదువుకుని సంతోషించి పాత కథను మరచిపోయి చాల అపచారం చేస్తున్నామని విచారించిందికూడ. ప్రకాశంకు మాత్రం ఆమె ఏ విషయమూ చెప్పలేదు. 'చిన్న చిన్న విషయాలు చెప్పడం ఎందుకులెద్దు' అనే స్వభావం గల మనిషావిడ.

* * *

వంటింట్లో ఏవో పడిపోయిన అలికిడయింది. 'ఏంటి లక్ష్మి వంటింట్లో?' ప్రకాశం కేకేశాడు పొలం వెళ్ళబోతున్న వాడల్లాఆగి.

'అయ్యో! అయ్యో...ఎంతపని జరిగింది. పిల్లిపాలన్నీ వలకబోసిందయ్యో!...ఏం చెయ్యను దేవుడా! వెంకట్రమణా!' దొడ్డివేపు నుంచి పరుగెత్తుకొచ్చి వంటింట్లో తన విచారాన్ని వెలబోస్తున్న తన భార్య మాటలు విని చురచుర లాడుకుంటూ ప్రకాశం పొలం వెళ్ళబోయాడు అప్పుడే తన యింటిముందు నిలుచున్న కాంతంను చూసి 'ఏం కాంతం ఏదో పనిమీద రోజూ వస్తున్నావ్?' అన్నాడు ప్రకాశం కాస్త గట్టిదనంగా.

'అబ్బే! ఏం లేదండి లక్ష్మితో సరదాగా మాట్లాడుకుందామని...' అనుమానపు మనిషని గ్రహించే ఆగిందామె.

'ఊఁ,' అంటూ కదలాడు కాస్త కోపంగా. అయినా ముందుకు వెళ్ళ బుద్ధికాలేదు. వెనక్కు తిరిగాడు. ఇంకా కాంతం అతనివైపే ఏదో అనుమానంగా చూస్తున్నందు వల్ల ప్రకాశంకి అనుమానం కలిగింది. మళ్ళీ ముందుకు తిరిగి పొలంవెళ్ళే వాడల్లే, కుంతంట కాస్త దూరం నడక ప్రారంభించి మళ్ళీ వెనక్కు చూసాడు. కాంతం లోనకెళ్ళింది

గబగబా మరలా యింటికి తిరిగి వచ్చాడు ప్రకాశం. తిరిగివచ్చి వీధి గుమ్మంలో నుంచుని వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటున్న మాటలు వింటూ వుండిపోయాడు.

'వెంటరమణవారు చాలమంచివారుకదూ కాంతం?... ఎంత మంచివారు కాపోతే అంత వినయం అంత ప్రేమా చూపిస్తారు. ఆయనంటే ముందునాకు చాల అసహ్యంగా వుంటూండేది. కాని నాకిప్పుడాయనంటే ఏదో అనుభంధం, మమకారం, అనురాగం వున్నట్లుంది కాంతం, వెంటలక్ష్మి అంది చాల హుషారుగా,

'బాగా నేవుంది. మధ్య నాకెందుకు! ఆయనమాత్రం చాలమంచివారు. సద్గుణవంతులు. ఎవరినైనా ప్రేమించే గుణం ఆయనది...ఎందుకులే లక్ష్మి నేను ప్రతిరోజూ మీయింటికి రావడం గురించి మీ ఆయన ఏదోలా అనుమానం పడ్తున్నారు. ఈ లేనిపోని గొడవ నాకెందుకు గాని వెంకటరమణవారి విషయంలో మాత్రం జాగ్రత్త! ఎక్కువసేపువున్నా అంతా ఏదోలా అనుకోచ్చు.' కాంతం మాటల్లో ఏదో భయంవుంది.

బయట నిలబడ్డ ప్రకాశంవొళ్లంతా గొంగలిపురు నట్లయిపోయింది.

'కాంతం!, వెంకటరమణగారు ఇవాళ రాత్రి మన వూరుగురించి ఏవేవో మాట్లాడుతారంట' 'ఏమోనమ్మా! మాట్లాడితే మాట్లాడనియ్యి' మూతిముడుస్తూ అంది కాతం.

'అలాగంటావేం కాంతం? ఆయనగురించి అంతా గొప్పగా చెప్పుకునేవాళ్లేకదూ...? అయితే నువ్వు ఏడో పనిమీదే వచ్చుంటావ్ కదూ?' 'ఏపనుందిలే! కాసిని పాలుపోస్తే ఇవాళ వెంకమరమణవారి కాఫీకి పని చేస్తాయి!' కాంతం అడిగింది ఇక వెళ్ళిపోవాలని.

'అరెరె! వెంకట్రమణా, ఏడుకొండల ప్రభూ!- ఎందుకడుగుతావుకాంతం? వెధవపిల్లి ఈవాళ పాలన్నీ దాని తలకాడపెట్టుకుంది. ఎంతపనిజరిగింది కాంతం. నాదురదృష్టమేమో, ఇంకా కావలిస్తే పాలకుండచూడు కాంతం' అంటూ వెంకటలక్ష్మి అమితమైన బాధపడ్తూ కాంతాన్ని వంటింట్లోకితీసుకెళ్లి ఖాళీఅయిన పాలకుండనూ నిదర్శనంగా క్రిందబలికిపోయిన పాలనూ చూపించింది.

వెంకటలక్ష్మి తాను సహాయంచేయలేనందుకు ఎంతో కష్టపడ్డా కాంతంకు మరేమీ అనిపించలేదు. కానిబయట కుతకుతా వుడికిపోతున్న ప్రకాశం బాధ చెప్పతరంగాదు.

కాంతం బయటకువచ్చినప్పుడు ప్రకాశం ఉగ్రనరసింహరూపందాల్చి 'నీవు మాయింటికి ఈ రోజునుంచి అడుగుపెట్టావంటే మాటామర్యాదదక్కదు. జాగ్రత్త!'

ENJOY BY SMOKING THE GREAT
3 HORSE BEEDIES

3 గుఱ్ఱం మార్కు

శ్రేష్ఠమైన పొగాకుతో తయారు కాబడిన 3 గుఱ్ఱముల బీడీలను చాలా కాలమునుంచి వాడుతూ, మన ఆంధ్రరాష్ట్రములో లక్షలాది ప్రజలు ఆనందమును, ఉత్సాహమును పొందుచున్నారు. శ్రేష్టమైన 3 గుఱ్ఱముల బీడీలతో ఇతర రకముల బీడీలను, విలువైన సిగరెట్లను పరీక్షించిన వాటి విలువ మీకే తెలియును.

DEALERS:—

C. A. S. & Co.
VIZAINAGARAM CITY.
Telegram : THREE HORSE :: Telephone 6.

అని గట్టిగా కేకలేసాడు. కాంతంకి ఏమీ అర్థంగాలేదు. కాని తాము మాట్లాడుకున్నమాటలు వినివుండొచ్చని ఆమె వెళ్లిపోయింది. ఆమాటలువిన్న వెంకటలక్ష్మి బయటకు గబగబావచ్చి 'ఏంటండీ కాంతాన్ని అలా అన్నారు. ఆమె ఏంచేసిందని?' అని అడిగింది. 'ఏంచేసిందా? నీకు ఏమైనా కబుర్లు జేరేస్తుందా?' కోపంగా అన్నాడు ప్రకాశం.

'అయ్యయ్యో! ఏంటండి మీరంటుంది! ఏడుకొండల వెంకటరమణ!— ఎంతమాటన్నారండి! కాస్తస్నేహం గావుంటంకూడా తప్పేనాండి' ఏంఅన్యాయమండీ! ఈ అన్యాయం చూస్తూ ఎలావూరుకుంటున్నావయ్యా వెంకట్రమణదేవా!'

'నోర్మూయ్! 'వెంకటరమణ' అని అన్నావా నేనూరుకోను. మీరిద్దరూ ఆడుతున్న నాటకం నాకు తెలియదేంటే?' కోపంగా ప్రకాశం అన్నాడు.

'అయ్యో ఏడుకొండల వెంకటరమణా నామొర ఆలకించుతండ్రీ!' అంటూ వెంకటలక్ష్మి లోనకెళ్లి పోయింది.

'వెంకటరమణట! వెంకటరమణ!' అని పల్లునూరుతూ కోపంగా ప్రకాశం పైమీద కండువా దులిపి పొలం వెళ్లి పోయాడు.

తన భర్త ప్రవర్తనచూసేరికి వెంకటలక్ష్మికి చాల బాధకలిగింది. అయినా మళ్లీ ఓసారి పుట్టింటికి వుత్తరం వ్రాసి ఈయనవిషయం ఏంటో తెలుసుకోవాలన్న అభిప్రాయంకూడ కలిగింది.

అసాయంత్రం ప్రకాశం యింటికివస్తూంటే వెంకటరమణగారు, కాంతం అలామాట్లాడుకుంటూవస్తున్నారు, కాంతం నీళ్లబింది ఎత్తుకువస్తుంది. ఆ ప్రక్కనే వెంకటరమణగారు మాట్లాడుతూవస్తున్నారు. అలా కాస్తదూరంగా నడుస్తూవస్తున్న ప్రకాశంకు 'వెంకటలక్ష్మి' అని అంటూండం వినిపించింది: ఇంకా సరిగా వింటూ నడక ప్రారంభించాడు. చాలాసార్లు అతనికి తన భార్యపేరు సంభోదించడం వినిపించింది. కోపంతో వుడికిపోతూ ఇక వినడానికి అవకాశంలేక యింటికి తిరుగొచ్చాడు. ప్రకాశంయింటికి వచ్చేసరికి లక్ష్మి నీళ్లతోడి భోజనం పెట్టి సిద్ధంగావుంది సింగారించుకుని. ఆమెను చూడడంతో ప్రకాశానిక్కోపంవచ్చి 'ఎక్కడకీ ప్రయాణం? అని అడిగాడు.

ఆమె మాట్లాడలేదు.

మళ్లి ప్రకాశం రెట్టించాడు; 'ఎక్కడికే?'

'పేరుపెట్టి పిలిచేవారు ఇప్పుడిలా అంటారేంటండి. ఏంప్రారబ్ధంవచ్చింది! వెంకట్ర...'

'ఛీ! నోర్మూయ్' అన్నాడు ప్రకాశం ఆ మాట కడ్డువేసి. క్షణం నిశ్శబ్దం.

'స్నానం చెయ్యండి, నీళ్లుతోడాను.'

'నేనడిగేదేంటి, నువ్వు చెప్పేదేంటే? ఎక్కడిక్కి సింగారించుకు తయారయ్యావ్?'

'ఎందుకండి అంత కోప్పడతారు. నాకు పెళ్లయి ఇన్నిసంవత్సరాలయింది, కాస్త పూళ్లో ఏంజరుగుతున్నా తీసుకెళ్లారూ?'

'అందుకని?' గట్టిగా ప్రశ్నించాడు.

'మనం ఈ వేళ వెంకటరమణగారి ఉపన్యాసం...'

'విండానికి వెళ్దామంటావ్?'

'అవునండి''

'ఛీ! వెధవముండ!, నీకేమన్నా బుద్ధుందంటే?, వాడికీ నీకూ ఏంటి సంభంధం?'

'వెంకటరమణా నువ్వేదిక్కు!'

'ఏమన్నావ్? వాడా నీకు దిక్కు? మళ్లీ వాడిపేరెత్తావంటే నీప్రాణం తీస్తాను.' నిజంగా ప్రాణం తీసేవాడి ఫోజుపెట్టి అన్నాడు ప్రకాశం.

ఇంకేమన్నా లాభంలేదని వెంకటలక్ష్మి లోనకెళ్ళిపోయింది అతని ప్రవర్తన అర్థంగాక.

ఆ రాత్రంతా ప్రకాశం ఆమెపై కోపంగానే వున్నాడు. ఏదో ఆలోచిస్తూన్నాడు. మళ్లీ ఏదో మూలుక్కుంటూ వున్నాడు. దూళ్ళకు కాస్త గడ్డివేయటం మానివేసాడు. అంతా అతనికి ఎదురుతిరుగుతున్నట్టు బాధపడ్డాడు.

ఆ మర్నాడు ప్రొద్దున్న వెంకటలక్ష్మి, కాంతంతో మాట్లాడుతుండడం తన కళ్ళారా చూసాడు.

అతని వళ్ళంతా భగ్గున మండిపోయినట్లయింది. అతను సాయంత్రం పొలాన్నుంచి దూళ్ళను తోలుకొస్తుంటే తన యింటి గుమ్మంలో వెంకటరమణగారు తన భార్య వెంకటలక్ష్మితో మాట్లాడుతుండడం చూసి గబగబా యింటికొచ్చి, ఇక వెనకా ముందూ చూడక వెంకట

Telegram : "LITHOGRAPH" Telephones : 58 & 75

THE NATIONAL LITHO PRESS

( ESTD. 1933)

RAILWAY FEEDER ROAD, Post Box No. 30 SIVAKASI, (S. I.)

దక్షిణ భారతంలో ఖ్యాతిగాంచిన ముద్రణాలయం !!

ది నేషనల్ లితో ప్రెస్ - శివకాశి,

నిపుణులైన పనివారలచే మా ప్రెస్‌లో అందమైన విధంగా అగ్గిపెట్టె, బీడి, మిల్, సోప్ ఫైర్ వర్క్స్, బట్టలు, కాఫీ, టీ, మిఠాయి, సోడా మొదలయిన వాటికి కావలసిన లేబిల్సు, మరియు పెట్టెలు, లితోలోను. ఆఫ్‌సెట్‌లోను అచ్చువేసి ఇవ్వబడును. చిత్రాలుగల కాలెండర్లు "ఫోటో ప్రాసెస్" మూలంగాను ఆఫ్‌సెట్ పద్ధతిలోను తయారుచేసి ఇవ్వగలము.

ఆకర్షణీయమైన పలురంగులలో పువ్వుల బార్డర్లలో పల వివాహమహోత్సవాహ్వాన పత్రికలు రెడీమేడ్‌గా మావద్దనున్నవి.

ముద్రణాలయములకు కావలసిన లితో, ఆఫ్‌సెట్ ఇంకులకు :—

గిరిశెన్ ప్రింటింగ్ ఇంక్ ఫ్యాక్టరీ - శివకాశి,

వారికి వ్రాయండి.

రమణగార్ని, ప్రకాశం తన చేతులోని జువ్వకర్రతో బలంగా కోపంకొద్దీ నాలుగు వేసాడు.

వెంకటలక్ష్మి నెత్తీ నోరూ బాదుకుంది. ఆ చుట్టు ప్రక్కలవాళ్లు నలుగురైదుగురు ఈ రభస విని పరుగెత్తుకొచ్చారు.

'ఏంటండీ ప్రకాశంగారూ! ఇలా ఆయన్ని కొట్టారు. ఆయనేం చేసాడు?' అని ఒకాయన ప్రశ్నించాడు.

'నీకేమీ చెప్పనవసరంలేదుఫో!' అని గద్దించి తన భార్యను 'లోనకు నడవే!' అని గెంటాడు.

'వెంకట్రమణా!' అంది వెంకటలక్ష్మి ఇక సహించుకోలేక. అక్కడున్నవాళ్ళంతా ఆమె మాట విని ముక్కుమీద వ్రేలు పెట్టుకున్నారు.

'వెంకటరమణ, వెంకటలక్ష్మి, రమణ, లక్ష్మి' అన్నాడు ఒకతను అనుమానంగా.

'ఓహో! ఇదా సంగతి. ఇంకా ఏంటో అనుకున్నా!' అన్నాడు మరో ఆయన అంతా అర్థంచేసుకుని.

'వెళ్తున్నా చెల్లాయ్! వీడిపని నేచెప్తాలే!' అంటూ వెంకటరమణగారు వెళ్ళిపోయారు.

'పైగా ఈ పెద్దమనిషి చెల్లాయ్ అంటున్నాడు వీడి తస్సాదియ్యా...మనిషికేమైనా బుద్ధుంటేగా-' అంటూ ఒకాయన తిరుగుముఖం పట్టాడు.

వెంకటరమణగారు తన భార్యను 'చెల్లాయ్' అని పిలిచినందుకు, మళ్ళీ వీడు బయటపడకుండా ఏదో నాటకం ఆడుతున్నాడనుకున్నాడు ప్రకాశం. ప్రకాశంకు మాత్రం తన భార్యమీద వెంకటరమణగారిమీద బ్రహ్మాండమైన సందేహం అతని హృదయంలోనుంచి మాయంకాలేదు.

ఆ మర్నాడు రాత్రి వెంకటరమణగారు, మరో పెద్దమనిషి అయిన సింహాచలంగారు, వీధిగుమ్మంలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్న ప్రకాశం దగ్గరకు వచ్చారు. ప్రకాశంకు భయంవేసింది కొడ్తారేమోనని. ప్రకాశం జంకకుండా ధైర్యం ఎరువు తెచ్చుకుని గుడ్లెర్రజేసి వారి ద్దరివంకా చూడడం ప్రారంభించాడు. సింహాచలానికి నవ్వు వచ్చింది.

'ఏమోయ్ ప్రకాశం! దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?' అన్నాడు సింహాచలంగారు చిరునవ్వు నవ్వుతూ.

'అబ్బే ఏంలేదండి!' అని మళ్ళీ ప్రకాశం గంభీర్యంగా ఫోజుపెట్టాడు.

'ఏమీ లేదంటే ఎట్లా?, మళ్ళీ ఎవర్నో అనుమానించి కొట్టాలని ప్లానేస్తున్నావేంటి?'

'మీరేమీ అనవసరం లేదు.' కోపంగా అని ముఖం మరోవైపుకు త్రిప్పుకున్నాడు.

'అలా పొగరబోతుతనంగా అంటే ఎట్లా?' సింహాచలంగారు అన్నారు.

ప్రకాశం మాట్లాడలేదు. కోపంతో ఉడికిపోతున్నాడు. 'మీ ఆవిడిని ఓసారి పిలు. అసలు విషయం మాట్లాడుకుందాం.'

'ఏం ఎందుకు? నాక్కాకుండా మరొకడ్కి కట్టబెడ్తావికా?'

'అదేంకాదు కాస్త పిలవ్వయ్యా!'

'అవసరం లేదు.'

'పోనీయ్ నువ్వయినా కాస్త స్థిమితంగా కూర్చుని సమాధానమిస్తావా?' సింహాచలంగారు ప్రశ్నించారు.

'.....................'

'వెంకటరమణగారిలాంటివార్ని అనవసరంగా కొట్టడంలోగల నీ అభిప్రాయం ఏంటి?'

'ఏంటా? నాకొంప నాశనం చేస్తుంటే ఎవడైనా గాజులు తొడుక్కుని కూర్చున్నాడనుకున్నారా?'

'ఏంటేంటి? ఆయన కొంప గుల్లచేస్తున్నాడటంటయ్యా? నీకేమన్నా అర్థం తెలిసే మాట్లాడుతున్నావా అని?'

'ఆ. బాగా తెలుసు. అర్థం తెలియనంత అసమర్థుడననుకుంటున్నారా?'

ప్రకాశం మాటవిని వెంకట రమణగారు నవ్వుకుని ఆయన మాత్రం ఆకాశంలోకి చూస్తూ వుండిపోయారు. ఇంతలో లోపల నుంచి వెంకటలక్ష్మివచ్చి 'ఏమండీ భోజనం చెయ్యరూ?' అని భర్తను అడిగింది.

'ఓసీ ముండా! లోనకపో' గట్టిగా అన్నాడు ప్రకాశం. 'వెంకటరమణ తండ్రీ కరుణించవయ్యా' అని ఆమె లోనకెళ్ళిపోయింది. పరుగెత్తుకెళ్ళి ప్రకాశం ఆమెను కొట్టబోయి ఆగిపోయాడు.

కోపంతోనూ బాధతోనూ మండిపోతూ 'ఏమే నీకేమైనా సిగ్గూ వుందంటే? రంకు మొగున్ని చూసేసరికి వెనకా ముందూ కనిపిస్తల్లేదేంటే?' ప్రకాశం అన్నాడు.

'అయ్యో కృష్ణ! కృష్ణ! ఏడుకొండల వెంకట్రమణా! —ఇవేం మాటలండీ? అన్యం పుణ్యం తెలియని నన్ను ఏడుపిస్తున్నారు.'

'మళ్ళీ అదేమాట! ఏడుకొండలవాన్ని అడ్డం పెట్టుకుని నీ వ్యాపారమంతా సాగిస్తున్నావన్నమాట?'

'ప్రకాశం, ఇప్పుడదే బయటపెట్టు అసలు విషయం ఏంటో తెలిసిపోతుంది. ఎవ్వరికీ ఏ బాధ వుండకూడదు.' సింహాచలం గారు అన్నారు వెంకటరమణగారివైపు చూస్తూ, కాసుపరిష్కారణార్థమై.

ఆ మాటలో ఏదో అనుమానం గోచరించింది ప్రకాశంకు. "ఏమండీ మీరిద్దరూ కాపరాల్ని విడగొట్టడమేనా? పైగా అంతా చెప్పించాలా?' మీరువెళ్ళొచ్చు' ప్రకాశం అన్నాడు బాధగా.

ప్రకాశం పడిన బాధ చాల భయంకరమైనది. పైగా ఆమెను నేనమ్ముకున్న తన జీవితం గంగపాలు చేస్తున్నారని మరీ దుఃఖించాడు. తన ఆశలన్నీ ఇలా నాశనం అయిపోయి మళ్ళీ ఏకాకిగా బ్రతుకుతానని అనుకొన్నాడు ప్రకాశం. కాని ప్రకాశం బాధతో ఏడుస్తున్నాడు మనస్సులో.

'ప్రకాశం! నువ్వు మరేమీ బాధపడకయ్యా! అన్యాయంగా ఒకర్ని కొట్టావని పోలీసులకు తెలిస్తే ఏమవుతాదో తెలుసా?'

పోలీసులు మాటెత్తేసరికి ప్రకాశంకు కాస్త భయం వచ్చింది. ఏమీ మాట్లాడకుండా నిలబడిపోయాడు.

'ఏమయ్యా సమాధానమివ్వవూ? నిష్కారణంగా కొట్టివేయడమేనటయ్యా?'

'నిష్కారణం ఏముంది? వెధవ వేషాలు వేసేవాళ్ళను ఎవ్వరైనా తంతారు,' ప్రకాశం అన్నాడు.

'ఏంటి వేసినవేషాలు? రుజూ చేయి చూద్దాం.'

'రుజూ చెయ్యవలసిందేముంది. వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడం ప్రత్యక్షంగా చూసాను.'

'మాట్లాడకుంటే తప్పటయ్యా? నీ చెల్లెల్లో నీవు

మాట్లాడేవూ? అలాగే ఆమె కూడ 'అన్నయ్య'తో మాట్లాడింది.'

'చాల్లే వూర్కోండి. ఏదో సర్దేద్దామనుకుంటున్నారు. మీరుండబట్టి నిలబడ నిచ్చానుగాని లేకపోతే అయిపో వలసిందయిపోను. అంటూ ప్రకాశం వెంకటరమణగారి వైపు చూసి పళ్లుకొరికాడు. చేతులు గట్టిగా నలుపుతూ.

తలుపు ప్రక్క నిలబడ్డ వెంకటలక్ష్మి వాళ్ళ సంభాషణ వింటూ నిలబడిపోయింది. అది మాత్రం ప్రకాశం గమనించలేదు.

'ప్రకాశం?...బొత్తిగా మనిషికి అంత అనుమానం కూడదయ్యా! నీభార్యలాంటి ఉత్తమరాల్ని అనవసరంగా అప్రతిష్ఠ పాలుచేస్తావేమయ్యా.'

'మీరూ బాగానే తయారయ్యారు. వాళ్ళిద్దరిమధ్య చాల గ్రంథం వుందండి సింహాచలంగారు.'

'ఏదో కాస్త చెప్పు?'

'చెప్పడమెందుక్కలెండి'

'పోనీయ్ నీ భార్యను కేకేయ్యవయ్యా!...అమ్మా లక్ష్మీ! ఓసారి ఇలా వచ్చెల్లుతల్లీ!' సింహాచలంగారు కేకేసారు.

వెంకటలక్ష్మి వచ్చి తన భర్తకు కాస్త దూరంలో నిలబడింది కంట నీరు పెడ్తూ.

'ఏమమ్మా లక్ష్మి ఏంటమ్మా అసలు విషయం?'

'నాకూ ఏమీ తెలీదండి' లక్ష్మి అంది.

'ఏమీ తెలీదూ?-ఇక నిన్ను వూరుకుంటే లాభంలేదే-నువ్వు పోతే యింకో పెళ్ళాం! మొన్న ఏం మాట్లాడుతున్నావు కాంతతో. అంతా నాటకం! నాటకం ఆడవే, ఆడు. ఎంతకాలం దాపరికం పెట్టి నీ ఆటలు సాగిస్తావో చూస్తాను.' ప్రకాశం మరో నిశ్చయంతో అన్నాడు తెగించి.

'మొన్న కాంతంతో నేనేమన్నానండి?'

'ఏమన్నావా నంగనాచి! ఎంతమంచివారు! ఎంత మంచివారు కాకపోతే అంత వినయం అంత ప్రేమా చూపిస్తారు?' ఓదో అనుభంధం అనురాగం ఆయనమీదున్నాయి అని కూశావే? ఇప్పుడిలా నేనన్నానని మాట్లు మార్చి మోసం చెయ్యాలనుకుంటున్నావా?'

'వెంకటరమణా!' లక్ష్మి అంది చెవులు మూసుకుంటూ.

'వెం-కట-రమ-ణ! ఇంకా ఏంటి కావలసిన నిదర్శనం? వాడి పేరు నెల రోజులనుంచి అస్తమానమూ స్మరిస్తున్నావు. అది కూడదంటే వినిపించుకోవు వాడి గురించి కాంతం నువ్వూ అలా మాట్లాడుకోవలసిన పనేముంది. వాడికీ నీకూ సంభంధం ఏముంది? ఆడదానివి కదా అని కనికరించి ఇంట్లో వుంచుతుంటే నెత్తినెక్కుతావా? రంకు మొగళ్ళతో కలసి నన్ను ధ్వంసం చెయ్యాలని ప్రయత్నిస్తున్నావంటే? నేను నిన్ను ఎంత ఆదరిస్తున్నానో గుర్తించావా? వాడిపేరు నిత్యం స్మరించడానికి వాడేమన్నా నీ దేవుడా! వాడి పేరే నిత్యం స్మరిస్తూ వుంటున్నావు. ఈ మార్పు మొన్ననే కలిగింది మళ్ళీ కాపరానిక్కి వచ్చిన తర్వాత. కట్ట తెగిన కోపంతో వెనకా ముందూ గమనించకుండా తనలో దాగివున్న దుష్టాగ్నిని బయటకు గ్రక్కేడు ప్రకాశం.

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్,
మదరాసు-17.

'అలా నన్ను ఆడిపోసుకుంటారెందుకు. నాకు వెంకటరమణ అన్నయ్యంటే ప్రాణం. నన్ను నమ్మండి' ప్రాధేయపడింది వెంకటలక్ష్మి.

'అంతా అబద్ధం...ఇక దాగాలన్న దాగదు. అస్తమానం వాడి పేరే స్మరించడానికి గలకారణం?'

నన్ను అర్థం జేసుకోకుండా అలా మీరు దూషించడం భావ్యంకాదు. మీ ప్రవర్తన నేటికి నాకు అర్థమయింది. వెంకట రమణ అన్నయ్యను ఏమీ అనకండి. కావలిస్తే వెంట్రమణ అన్నయ్య భార్యను అడగండి. ఆమె నేనూ ఎంత ప్రేమగా వుంటామో' కళ్ళ నుండి కారుతున్న నీళ్ళను తుడుచుకుంటూ అందామె.

'ప్రేమగా వుంటారు మొగుడుకోసం.' ప్రకాశం అన్నాడు అదోలా ముఖంపెట్టి.

'ప్రకాశం.' వెంకటరమణగారు అన్నారు అతన్ని గద్దిస్తూ.

'అన్నయ్యనే ప్రేమతో ఆనాడు లక్ష్మి, వెంకటరమణను పొగిడింది కాని మరో భావంతో అయ్యుండదు' సింహాచలంగారన్నారు ఏదో ఆలోచిస్తూ.

'మీ మాటలు నమ్మవలసినవు కావు. మిమ్మల్నెవర్ని నమ్మను మీరంతా ఒకటై నా యింటికి చిచ్చుపెట్టాలనే అభిప్రాయం మీది.'

'మీ అభిప్రాయాన్ని మామీద పులుముతున్నారెందుకు? మీరిలా విషయం తెలుసుకోకుండా అనడం భావ్యం కాదండి' ఆమె అంది విచారంగా.

'భావ్యం కాదూ? నువ్వు కనబడ్డావాడంట వెల్లడం భావ్యమటే?' ప్రకాశం అన్నాడు మండిపడ్తూ. ఆమాటలు వింటూంటే వెంకటరమణగారికి అతనిపై అసహ్యం వేసింది

వెంకటలక్ష్మి లోనకెళ్ళి, చాలరోజులక్రితం తన పుట్టింటిదగ్గరనుంచివచ్చిన వుత్తరం తన భర్త చేతిలో పెట్టింది. అతను నెమ్మదిగా అక్షరం అక్షరం కూర్చుకుని మరిచిపోయిన చదువు జ్ఞాపకం తెచ్చుకుంటూ చదువుతున్నాడు. ప్రకాశంకు ఆశ్చర్యమైంది. ఉత్తరం అంతా పరీక్షించాడు. కవరుమీద నాలుగైదు పోస్టు ముద్రలు కూడ వుండేసరికి నమ్మడం తప్పిందికాదు. పేరు మూలంగా అనుమానించడం కూడదనుకొన్నాడు.

అతను వుత్తరం మూస్తూ 'ఏమే లక్ష్మి ఈ పేరే నిన్ను మీవాళ్ళు స్మరించుకోమని చెప్పడానికి గల కారణం?' అని అడిగాడు కాస్త చల్లబడి.

ఆమె మాట్లాడలేదు.

'ఏ పేరు ప్రకాశం?' సింహాచలంగారు ప్రశ్నించారు. ప్రకాశం చెప్పడానికి సిగ్గు పడ్డాడు.

'ఏ పేరు లక్ష్మి.'

'మా అన్నయ్య పేరేనండి.'

'ఆసి నీయిల్లు బంగారంగానూ. ఇదటోయ్ నీ అనుమానం? బలేవాడివే! అయితేగాని ఆ పేరు స్మరించుకోవలసిన అగత్యం ఎందుకు కలిగింది లక్ష్మి, కాస్త అది కూడ మా చెవుల్ని మీ ఆయన చెవుల్ని పడేశావూ, ఇంకా ఏమన్నావుంటే అదీ ఒదుల్పోతాది. చెప్పమ్మా, చెప్పు...' ఉత్సాహంగా అడిగారాయన.

'ఏముందిలెండి. నాచిన్నతనంలో జబ్బు చేస్తే ఏడుకొండలవాడికి మొక్కేసారు, మళ్ళీ సంవత్సరం క్రితం జబ్బుచేస్తే మా అమ్మా, నాయనా మళ్ళీ తిరుపతి తీసుకెళ్ళారుకూడ. మొన్న కాస్త ఆరోగ్యం బాగుండడం లేదని వుత్తరం వ్రాసి ఎడ్రసు మా అన్నయ్యచేత వ్రాయించాను. అప్పటినుండీ అన్నయ్యతో మాట్లాడుతుండడంవల్లా, వదినతో చనువుగా వుండటంవల్లా కాంతం నేనూ మా అన్నయ్యగారి కుటుంబవిషయాలు మాట్లాడుకుంటూండంవల్లా ఈయనకు నామీద ఏదో కాస్త అనుమానం కలిగుంటాది. దానికిగానూ వూళ్ళో నానా రభస చేసారు. ఇంటిగుట్టు వీధిలో పెట్టారు.... నామీద పంతంకట్టి భోజనం మానేశారు.' అని నెమ్మదిగా వెంకటలక్ష్మి అసలు విషయం కాస్త బయటపెట్టేసరికి అంతా ఆశ్చర్యపోయారు. ప్రకాశం తాను చేసిన పనికి నొచ్చుకున్నాడు.

'జరిగిపోయిందేదో జరిగిపోయింది. పైగా అర్థం లేని అనుమానాలు పడి మా చెల్లాయ్‌ని కష్టపెట్టినందుకు మాత్రమే నాకు కోపం కలుగుతుంది - కాని మరేమీ కోపం లేదు ప్రకాశం' అంటూ తనమంచిదాన్ని వెంకటరమణ బయటపెట్టాడు. ప్రకాశంకు అతని హృదయ మేటువంటిదో అర్థమయింది.

'ప్రకాశం! మొదట ప్రతీవిషయంలోనూ అంత కంగారు పడి ఏమీ గ్రహించకుండా ప్రతీవాళ్ళమూ నోరుంది కదా అని అనేస్తే ఎట్లా చెప్పు? పేర్లు ఒకటి పైనా ఆ పేరు స్మరించినా ఇక అనుమానిస్తే ఎవరొప్పు కుంటారు. ఇప్పుడు వెంకటరమణ భార్య మన ఈ పల్లెటూరి మహిళామండలి కంతకూ అధ్యక్షురాలు. రేపో మాపో మన తాలూకా కంతకూ అధ్యక్షురాలు కాబోతుంది. మరి వెంకటరమణ భార్య అంతమందితో చనువుగా వుంటూందికదా, ఈయన నీవలే అనుమానంపడి కుములుతూవుంటే ఎట్లా చెప్పు.?... స్త్రీలకు ఆమాత్రం స్వాతంత్ర్యం ఇవ్వకుండా వంటింట్లో బంధిస్తూవుంటే మనదేశం ఏంపైకొస్తుంది మనమేం పైకొచ్చి ఏడుస్తాం? అందుకని నువ్వు పాపవిషయాలన్నీ మర్చిపోయి శాస్త్రోక్తంగా ఆలోచిస్తే అంతా నీకే అర్థమవగలదు.' అన్నారు సింహాచలంగారు కేసు తీర్పుజేస్తూ.

ప్రకాశంకు పాతవిషయాలువల్ల ఎంత ప్రయోజనం వుందో తెలుసుకుని చాల బాధపడ్డాడు. తనకు తానే తిట్టుకున్నాడు. తన భార్యపై అనవసరంగా అపవాదు వేసినందుకు మరి బాధపడ్డాడు. అంతకంటే వెంకటరమణలాంటి గ్రామ పౌరున్ని అన్యాయంగా కొట్టినందుకు, తిరిగి వెంకటరమణ తనని ఏమీ అననందుకూ అతనికి తన హృదయపూర్వం వందనాలుసమర్పించాడు తన మనస్సులో.

'మరి చీకటి పడ్తుంది ప్రకాశం బావ! వెళ్తాను. చెల్లాయ్ వెళ్ళొస్తా, మీ ఆయనకు నిమ్మకాయ మర్దనా చెయ్యి ఎందుకన్నా మంచిది.' వెంకటరమణగారు ఒక మాట సరదాగా ప్రయోగించారు.

సింహాచలంగారూ, వెంకటరమణగారూ వెళ్లిపోతుంటే నవ్వుకుంటూ ప్రకాశంకు వెంకటలక్ష్మిని చూసి నవ్వాలో ఏడ్వాలో తెలీక ప్రక్కకు తీసుకున్నాడు.

'నామీద మీకెందుకండి అంత అనుమానంకలిగింది?' ఆమె ప్రశ్నించింది ప్రకాశం ముఖంలోకిచూస్తూ.

కాస్సేపు ప్రకాశం తటపటాయించి 'ముఖ్యంగా ఆ పేరే నాకింతబాధ తెచ్చిపెట్టింది లక్ష్మి.' అన్నాడు.

'అనుమానం పెనుభూతంలాంటిది సుమండి!' వెంకటలక్ష్మి అంది పాత కథను మర్చిపోరూ.

ప్రకాశం మాత్రం 'నిజమేలక్ష్మి' అనుకున్నాడు మనస్సులో.


# ది వైశ్య బ్యాంక్ లిమిటెడ్.,

స్థాపితము : 1930 షెడ్యూల్డ్ బ్యాంకు

రిజిస్టర్డ్ ఆఫీసు : వైశ్యాబ్యాంకు బిల్డింగ్ : అవిన్యూ రోడ్.

## బెంగళూరు సిటీ

చేర్ మెన్ ;- శ్రీ యాదాళం, ఎస్. గోపాలకృష్ణ శెట్టి.

మా ప్రధాన కార్యాలయం బెంగళూరులో ప్రత్యేకముగా నిర్మించియున్న అండర్ గ్రౌండ్స్ వాల్ట్సలో, వివిధ సైజులలోయుండు సేఫ్ డిపాజిట్ వాల్ట్సలలో, సేఫ్ లాకర్లు సరసమగు రేటులో లభించును.

ఫిక్సెడ్ డిపాజిట్లుపైన 1 నుండి 5 సంవత్సరములకు 4½% నుండి 5½% వరకు వడ్డి ఇవ్వబడును.

సేవింగ్స్ బ్యాంకు డిపాజిట్టుపైన వడ్డీ రేటును 3¼ కు, మా అన్ని ఆఫీసులలోనూ పెంచియున్నాము.

మావద్ద తీసికొనబడు మూడేండ్ల క్యాష్ సర్టిఫికేట్స్ మీద సం॥కు 5% వడ్డీ గిట్టుబాటగును.

అన్ని రకముల బ్యాంకింగ్ బిసినెస్ చేయుచున్నాము.

వివరములు, మా ఆఫీసులలో దేనినుండి అయినా తెలుసుకోవచ్చు.

జె. సూర్యనారాయణశెట్టి,
జనరల్ మేనేజర్.